# కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే అధోగతే


ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

- తెలంగాణకు కేసీఆర్ పాలనే శ్రీరామ రక్ష
- ఆర్మూర్‌ను అభివృద్ధికి అడ్డాగా మార్చిన..
- మూడోసారి ఆశీర్వదించండి.. జీతగాడిలా పనిచేస్తా
- 'నమస్తే నవనాథ పురం'లో ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఆర్మూర్, అక్టోబర్14; తెలంగాణకు కేసీఆర్ పాలనే శ్రీరామ రక్ష అని ఆర్మూర్ ఎమ్మెల్యే , బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. ' నమస్తే నవనాథపురం ' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆర్మూర్ మండలంలోని మగ్గిడి, ఖానాపూర్ గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర నిర్వహించారు. పిప్రి గ్రామం నుంచి వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువకులతో కలిసి జీవన్‌రెడ్డి స్వయంగా బైక్ నడుపుతూ ర్యాలీగా గ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో జీవన్‌రెడ్డికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఎన్నిక ప్రచారంలో భాగంగా గ్రామంలోని వీధి వీధి తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మగ్గిడి, ఖానాపూర్‌లో ఏర్పాటు చేసిన సభల్లో జీవన్‌రెడ్డి మాట్లాడుతూ... ఇప్పటి వరకు మగ్గిడి గ్రామానికి రూ.27కోట్లు, ఖానాపూర్ గ్రామానికి రూ.21కోట్ల నిధులు మంజూరుచేసినట్లు తెలిపారు. ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. గ్రామాల్లో ఎటు చూసినా అభివృద్ధి, సంక్షేమమే కనిపిస్తోందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఏనాడైనా మీ ఊళ్లను పట్టించుకున్నారా అని గ్రామస్తులను ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీలను నమ్మితే అధోగతే అని పేర్కొన్నారు. దేశమే అబ్బురపడేలా కొనసాగుతున్న కేసీఆర్ పాలన చూసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. మగ్గిడి, ఖానాపూర్ గ్రామాల్లో ప్రగతి నివేదికను ప్రజల ముందు చదివి విన్నిపించారు. బీఆర్ఎస్ అంటేనే 24గంటల ఉచిత విద్యుత్ అని, కాంగ్రెస్ అంటే మూడు గంటల కరెంట్ అని అన్నారు. బీఆర్ఎస్ అంటే వరి కోతలు అని, కాంగ్రెస్ అంటే కాల్చివేతలు, కూల్చివేతలు, ప్రజల గుండెల్లో కోతలన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల కడుపు నింపేది బీఆర్ఎస్ మేనిఫెస్టో అని, ప్రజల కడుపులు కొట్టేది కాంగ్రెస్ మేనిఫెస్టో అని అన్నారు. ఆర్మూర్‌ను అభివృద్ధికి అడ్డాగా మార్చానని, నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో మళ్లీ గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణకు కేసీఆర్ మూడో సారి సీఎం కావాలని, మళ్లీ బీఆర్ఎస్‌దే అఖండ విజయమన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు తెలంగాణకు చేటు అని పేర్కొన్నారు.కార్యక్రమంలో పిప్రి సొసైటీ చైర్మన్ సోమ హేమంత్‌రెడ్డి, మగ్గిడి సర్పంచ్ సుమలతా నర్సయ్య, ఖానాపూర్ సర్పంచ్ సింగిరెడ్డి మోహన్ , బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆశీర్వాద యాత్రకు కార్యకర్తలతో బైక్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

# క్రీడల్లో గెలుపోటములు సహజం

## బిచ్కుందలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన షిండే


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

నిజాంసాగర్, అక్టోబర్14: క్రీడల్లో గెలుపోటములు సహజమే అని.. ప్రతిఒక్కరూ క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పిలుపునిచ్చారు. బిచ్కుంద మండల కేంద్రంలో నిర్వహిస్తున్న తెలంగాణ క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే షిండే శనివారం ప్రారంభించారు. ముందుగా ఆయా జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. క్రీడల్లో యువత రాణించేలా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి గ్రామంలో ఒక తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు. ఇటీవల గ్రామాల్లోనియువకుల కోసం సీఎం కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను ప్రభుత్వం అందజేసిందని చెప్పారు. గ్రామాల్లోని యువత క్రీడా పోటీల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో బిచ్కుంద ఎంపీపీ అశోక్‌పటేల్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రావ్‌దేశాయ్, నాయకులు రాజు శ్రీహరి, బాలు, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు నాగ్‌నాథ్‌పటేల్, బస్వరాజ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌లోకి వలసల జోరు

## కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్ సమక్షంలో మైనార్టీల చేరిక


గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ముజీబుద్దీన్

కామారెడ్డి, అక్టోబర్ 14 : బీఆర్ఎస్‌లో జోరుగా వలసలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. తాజాగా కామారెడ్డి జిల్లా కేంద్రంలోని 31వ వార్డుకు చెందిన 80 మంది మైనార్టీలు శనివారం రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ముజీబుద్దీన్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించడానికి కామారెడ్డిలోని చాలామంది మైనార్టీలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మైనార్టీలు పాల్గొన్నారు.




## మంత్రి వేములకు ప్రముఖుల పరామర్శ

రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ ఇటీవల మృతి చెందగా.. శనివారం ఆయనను వేల్పూర్‌లోని నివాసంలో ఆదిలాబాద్, జగిత్యాల్, ముథోల్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, డాక్టర్ సంజయ్, విఠల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, టూరిజం ఎండీ మనోహర్, వరంగల్ ఎలక్ట్రిసిటీ డైరెక్టర్ మోహన్ తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా మంజులమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని వారు ప్రార్థించారు. మంత్రి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి వేముల తండ్రి దివంగత రైతు నాయకుడు వేముల సురేందర్‌రెడ్డితో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

# బతుకమ్మ సంబురాలు షురూ



కామారెడ్డి/మాచారెడ్డి/భిక్కనూరు/బీబీపేట/తాడ్వాయి, అక్టోబర్ 14 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ. శనివారం ఎంగిలిపూల బతుకమ్మతో వేడుకలను ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని సిరిసిల్ల రోడ్డులో ఉన్న ధర్మశాల, విద్యానగర్‌లోని సాయిబాబా ఆలయం, పంచముఖి హనుమాన్ ఆలయం, అశోక్ నగర్‌తోపాటు పలు వీధుల్లో మహిళలు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం నీటి కుంటల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. మాచారెడ్డి మండలంలోని ఆయా గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. పూలను అందంగా పేర్చి బతుకమ్మలను తయారు చేశారు. సాయంత్రం బతుకమ్మలను ప్రధాన వీధుల్లో పెట్టి మహిళలు బతుకమ్మ ఆడారు. అనంతరం గ్రామంలోని చెరువులో నిమజ్జనం చేశారు. భిక్కనూరు, తాడ్వాయి, బీబీపేట్ మండల కేంద్రాలతోపాటు అన్ని గ్రామాల్లో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. మహిళలు అందంగా పేర్చిన బతుకమ్మను వీధుల్లో పెట్టి ఆడిపాడి సందడి చేశారు. అనంతరం బతుకమ్మను గ్రామ చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు.


మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

← భిక్కనూరు లో..


కామారెడ్డి పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


బీబీపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు